*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

## 95. అత్ తీన్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. ఇందులో 8 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరాలో వివరించబడిన విషయం, శిక్షా బహుమానాలు లభించడం సత్యం. ఎటువంటి కర్మ చేస్తే అటువంటి ప్రతిఫలాన్నే పొందవచ్చు. సదాచరణ చేసిన వారికి ఇహలోకంలోనూ, పరలోకంలోనూ సాఫల్యం ఉంది. విద్యారంగంలో ఇతరుల కన్నా ముందు ఉన్న జాతిలాగా, ఐక్యతారంగంలో ఇతరుల కన్నా అగ్రగామి అయిన జాతిలాగా, ఆచరణ, నైతికతా రంగంలో ఇతరులను మించిపోయిన జాతి ఇహపరాలలో తప్పక సాఫల్యం పొందుతుంది. ఇంకా దుష్కార్యాలు చేసిన జాతి ఇహపరాలలో అందుకు శిక్ష అనుభవిస్తుంది. అజ్ఞానం, ఆచరణా శూన్యత, విభేదాలు, దుర్నీతి గలదయితే ఆ జాతి తప్పక నాశనమవుతుంది. అభివృద్ధి, సాఫల్యాల మార్గం, విశ్వాసం, ఆచరణల మార్గం కఠిన శ్రమతో కూడిన మార్గం. త్యాగాల మార్గం. ఏ మనిషి ఏ జాతి అందుకోసం ధైర్యంగా నడుం బిగిస్తే అల్లాహ్ తన కారుణ్యంతో సౌలభ్యం కలిగిస్తాడు. ఆ జాతి చూస్తుండగానే కొన్ని సంవత్సరాలలో అభివృద్ధి, సాఫల్యాల గమ్యాన్ని చేరుకుంటుంది. ఇంకా విశ్వాసం, ఆచరణల మార్గాన్ని విడిచిపెట్టిన జాతి, కఠిన శ్రమతో కూడిన మార్గాన్ని విడిచిపెట్టిన జాతికి వినాశకర మార్గం సులభమవుతుంది. విశ్వాసం, సదాచరణల మార్గాన్ని విడిచిపెట్టినందువల్ల కొన్ని సంవత్సరాలలోనే సర్వనాశనం అయిపోతుంది. నేడు మన జాతిలో కోట్లాది అజ్ఞానులు ఉన్నారు. అందుకు జాతికి శిక్ష లభిస్తోంది. ఈనాడు మనలో విభేదాలు చాలా ఉన్నాయి. జాతికి అందుకోసం కూడ శిక్ష లభిస్తోంది. ఈనాడు మనలో ఆచరణా రాహిత్యం కూడా అమితంగా ఉంది. ఆఖరికి ఫర్జ్ కూడ నియమం తప్పక చేయడం లేదు. మనకు దాని శిక్ష కూడా లభిస్తోంది. నేడు మనలో నైతికత కూడ బాగా కొరవడింది. అందుకు నష్టాన్ని కూడ మనం అనుభవిస్తున్నాం. కనుక శిక్షా బహుమానాలు లభించడం సత్యం అని నిరూపించబడింది.

## 95. అత్ తీన్

**ఆయత్‌లు : 8** **అవతరణ : మక్కాలో**

*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

(1) అంజీర్ (అత్తి), జైతూన్ సాక్షిగా (2) సీనా పర్వతం సాక్షిగా (3) ఇంకా ఈ ప్రశాంత నగరం (మక్కా) సాక్షిగా (4) మేము మానవుణ్ని ఉత్తమ రూపంలో పుట్టించాము. రూపురేఖల పరంగానూ, బుద్ధిజ్ఞానాల పరంగానూ (5) తిరిగి అతణ్ని నీచాతి నీచుడుగా మార్చివేశాము. అతడి బద్ధకం, అలసత్వం ఆచరణా రాహిత్యం వలన పరాభవం పాలు చేశాము.

رُكُوعُهَا 1 سُوْرَةُ التِّيْنِ مَكِّيَّةٌ 95 آيَاتُهَا 8

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

وَالتِّيْنِ وَالزَّيْتُوْنِ ﴿1﴾

وَطُوْرِ سِيْنِيْنَ ﴿2﴾

وَهٰذَا الْبَلَدِ الْاَمِيْنِ ﴿3﴾

لَقَدْ خَلَقْنَا الْاِنْسَانَ فِيْٓ اَحْسَنِ تَقْوِيْمٍ ﴿4﴾

ثُمَّ رَدَدْنٰهُ اَسْفَلَ سٰفِلِيْنَ ﴿5﴾

| | |
|---|---|
| (6) కాని విశ్వసించినవారు, సదాచరణ చేసిన వారికోసం ఎన్నటికీ తరగని పుణ్యం, ప్రతిఫలం ఉన్నాయి. (7) కనుక (ఓ ప్రవక్తా!) ఇక మీదట ఎవరు నిన్ను శిక్షా బహుమానాల విషయంలో ధిక్కరించగలరు? (8) ఏమిటి, అల్లాహ్ పాలకులందరి కన్నా ఉత్తమ పాలకుడు కాదా? (నిస్సందేహంగా అల్లాహ్ అందరు పాలకులకన్నా ఉత్తమ పాలకుడు, న్యాయం చేసే పాలకుడు) | إِلَّا الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فَلَهُمْ أَجْرٌ غَيْرُ مَمْنُونٍ ﴿6﴾ فَمَا يُكَذِّبُكَ بَعْدُ بِالدِّينِ ﴿7﴾ أَلَيْسَ اللَّهُ بِأَحْكَمِ الْحَاكِمِينَ ﴿8﴾ |

ع 1 8 20

1 – 8 వాక్యాలు

శిక్షా బహుమానాల విషయం పూర్తిగా పక్కా వ్యవహారం అని ఈ సూరాలో తెలుపబడుతోంది. ఎవరు ఎటువంటి కర్మలు చేస్తే అటువంటి ఫలితాన్నే పొందగలరు. వేప విత్తనాన్ని నాటి, అందులో నుంచి మామిడి చెట్టు మొలుస్తుందని భావిస్తే అతడి అభిప్రాయం శుద్ధ తప్పు. ఇదేవిధంగా దురాచరణ చేసి ఎవరైనా స్వర్గానికి పోతామని ఆలోచిస్తే అతడి ఈ ఆలోచన శుద్ధ తప్పు. ఈ సూరాలో శిక్షాబహుమానాలు తప్పక లభిస్తాయనడానికి నాలుగు రుజువులు ఇవ్వబడ్డాయి.

1. మొదటి రుజువు అంజీర్ (అత్తి) పండుది. అది జూదీ కొండ ప్రాంతం. అక్కడ అత్తిచెట్లు విస్తారంగా వున్నాయి. ఈ ప్రాంతంలోనే హజ్రత్ నూహ్ (అ) నావ ఆగింది. ఈ ప్రాంతం హజ్రత్ నూహ్ (అ) జాతికి ఇవ్వబడిన శిక్షాబహుమానాలను గుర్తుకు తెస్తుంది. విశ్వసించిన వారు, సదాచరణ చేసినవారు శిక్ష నుండి తప్పించుకున్నారు. విశ్వసించనివారు, దుష్కర్మలు చేస్తూ ఉండిన వారు శిక్ష ద్వారా నాశనమయ్యారు. చివరికి ప్రవక్త భార్యపై, కుమారునిపై కూడా శిక్ష వచ్చి పడింది. ఇదేవిధంగా ఆదం, హవ్వాల వలన తప్పు జరిగినప్పుడు ఇద్దరూ దిగంబరులయ్యారు. అప్పుడు అత్తి చెట్ల ఆకులతో తమ మర్మాంగాలను కప్పుకున్నారు. అత్తిచెట్లు, వాటి ఆకులు ప్రపంచంలో ఇంకా ఉన్నాయి. అవి శిక్షాబహుమానాల వ్యవహారం తప్పక జరుగుతుందన్న సంఘటనలను గుర్తుకు తెస్తాయి. కాబట్టి సదాచరణ చెయ్యండి. తద్వారా స్వర్గానికి అర్హులు కాగలరు.

శిక్షాబహుమానాలను రుజువుచేసే రెండవ రుజువు వస్తువు జైతూన్. ఈ ప్రాంతంలో జైతూన్ చెట్లు ఎక్కువగా ఉన్నాయి. అంటే బైతుల్ మఖ్దిస్. ఇక్కడ ఈసా (అ) జన్మించారు. అక్కడ ఆయన ఆరాధన చేసేవారు. హితబోధ చేసేవారు. ఆ రోజులలో యూదులు ఉత్తమ అనుచర సమాజం. ఈసా (అ) కూడ యూద వంశంలోనే పుట్టారు. అల్లాహ్ యూదులను ధార్మిక నాయత్వం నుండి తప్పించి మరొక జాతికి నాయకత్వం అప్పగించదలచినట్లు తెలిసినప్పుడు, అల్లాహ్‌ను యూదులను నాయకత్వం నుండి తప్పించవద్దని దుఆ చేశారు. అదే సమయంలో యూదులు ఈసా (అ)ను హత్య చేయడానికి వస్తూ ఉన్నారు. అల్లాహ్ ఈసా (అ)ను సజీవంగా ఆకాశంలోకి ఎత్తుకున్నాడు. అల్లాహ్ ఈసా (అ) దుఆను అంగీకరించలేదు. యూదులు విశ్వాసం కోల్పోయారు. పరమ దుర్మార్గులు అయ్యారు. ఇటువంటి స్థితిలో వారికి నాయకత్వం ఇవ్వబడదు. కనుక అల్లాహ్ ముసల్మానులను ఉత్తమ సమాజంగా చేశాడు. ఇక ముస్లింలే ధార్మిక నాయకులు, ప్రతినిధులు.

శిక్షా బహుమానాలను రుజువు చేసే మూడవ రుజువు సీనాయి పర్వతం. అంటే తూర్ కొండ. ఇక్కడే హజ్రత్ మూసా (అ)కు ప్రవక్త పదవి లభించింది. ఈ ప్రదేశం ఇప్పటికీ ఉనికిలో ఉంది. ఇక్కడ మూసా (అ)కు ప్రవక్త పదవి లభించిందని రుజువు చేస్తోంది. ఆయన ఫిరౌన్ మరియు అతడి జాతిని విశ్వాసం, సదాచరణల వైపు

ఆహ్వానించారు. ఫిరౌన్, అతడి జాతి దాన్ని తిరస్కరించారు. ధిక్కరించారు. హింసా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అందువలన దైవశిక్ష అవతరించింది. ఫిరౌన్‌ను అతడి జాతితో సహా, అల్లాహ్ సముద్రంలో ముంచివేశాడు.

శిక్షా బహుమానాలను రుజువు చేసే నాలుగో సాక్ష్యం, మక్కా నగరం. మక్కా నగరం ప్రస్తుతం ఉనికిలో ఉంది. శిక్షా బహుమానాల వ్యవహారం మిక్కిలి సత్యమైనదని ఈ నగరం సాక్ష్యమిస్తోంది. ఒకానొకప్పుడు అబ్రహా రాజు దుర్బుద్ధితో కాబా కట్టడాన్ని నేలకూల్చాలని, అక్కడి పౌరులపై హింసా దౌర్జన్యాలు చేయాలని 60 వేల మంది సైన్యంతో వచ్చాడు. అల్లాహ్ అబాబీల్ (పక్షులు) ద్వారా వారిపై కంకరరాళ్ళు విసిరాడు. దానితో సైన్యం మొత్తం హతమయిపోయారు. అందరూ దైవశిక్షకు గురిఅయ్యారు. ఏ దేశానికైనా మంచి బాదుషా, మంచి పాలకుడు అయినవాడు, మంచి వారికి బహుమానం ఇస్తాడు. నేరస్తులు, గుండాలు, హంతకులకు శిక్ష విధిస్తాడు. అల్లాహ్ అందరికన్నా మంచి బాదుషా. ఆయన దగ్గర న్యాయం ఉంది. ఆయన మంచివారికోసం స్వర్గం నిర్మించాడు. చెడ్డవారికోసం నరకం నిర్మించాడు. ఈ సాక్ష్యాలు వివరణల తర్వాత శిక్షా బహుమానాలను ఎవరు తిరస్కరించగలరు? అంటే శిక్షా బహుమానాలను తిరస్కరించేవారు బుద్ధిలేని వారు. పిచ్చివాళ్ళు మాత్రమే కాగలరు.